# వర్షం ఫుల్.. ఉత్పత్తి డల్

- 5 రోజులుగా భారీ వానలతో ఓసీపీలపై తీవ్ర ప్రభావం
- 50 శాతం మాత్రమే ఉత్పత్తి..
- 18 ఓసీపీల్లో పూర్తిగా నిలిచిపోయిన మట్టి తవ్వకాలు, రవాణా



వర్షాలతో బొగ్గు రవాణా లేక నిలిచిన డంపర్లు

శ్రీరాంపూర్, జూలై 22: భారీ వర్షాలు సింగరేణిలో ఓసీపీ(ఉపరితల)గనులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. 18 ఓసీపీల్లో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. అలాగే ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థలకు అప్పగించిన మట్టి తవ్వకాలు, రవాణా పూర్తిగా నిలిచి పోయింది. దీంతో ప్రస్తుతం నిల్వ ఉన్న బొగ్గును విద్యుత్ పరిశ్రమలకు రవాణా చేస్తున్నారు. రోజుకు 1.60 లక్షల టన్నులు, 4 రోజుల్లో బొగ్గు ఉత్పత్తి 6.40 లక్షల టన్నులకు గాను, కేవలం 2.94 లక్షల టన్నులు ఉత్పత్తి చేశారు. ఇది కూడా ఓసీపీలపై నిల్వ ఉన్న బొగ్గు మాత్రమే అని చెప్పవచ్చు. అంటే రోజువారీ ఉత్పత్తిలో కేవలం 50 శాతం మాత్రమే నిల్వ బొగ్గును విద్యుత్ పరిశ్రమలకు రవాణా చేశారు. సింగరేణి వ్యా ప్తంగా ఉన్న 18 ఓసీపీ క్వారీ నుంచి ఒక్క బొగ్గు పెళ కూడా ఉపరితలానికి రానీయకుండా ఎడతెరపి లేకుండా బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగింది. అలాగే మట్టి తవ్వకాలు, రవాణా పూర్తిగా నిలిచి పోయింది. వాహనా లు పూర్తిగా క్వారీలోకి వెళ్లలేని పరిస్థితిలో దారులు బురదమయంగా మారాయి. దీంతో ఓసీపీలో వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. యాజమాన్యం కూడా నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తరలింపునకు నీటి మోటర్ పంపులు ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపిస్తున్నారు. వర్షాలు మరో 3 రోజులు కురిసే అవకాశం ఉంది. వర్షాకాలం ప్రభావం చూపకుండా చర్యలు తీసుకుంటున్నామని యాజమాన్యం చెప్పినప్పటికీ, అవి ఫలితాలనివ్వలేదు. భారీ వాహనాలు క్వారీలో నుంచి ఉపరితలానికి రావడానికి మార్గాలన్నీ బురదమయంగా మారాయి. అలాగే క్వారీల్లో పెద్ద ఎత్తున నీరు చేరింది. సింగరేణి వ్యాప్తంగా ఓసీపీల్లో 69 శాతం బొగ్గు ఉత్పత్తి జరుగుతున్నది. వర్షాలతో ఉత్పిత్తకి ఆటంకం కలిగింది. దానికి తోడు ఓసీపీల్లో కాంట్రాక్టర్లు వారు టెండరు పొందిన ఒప్పందం ప్రకారం మట్టి తవ్వకాలు(ఓబీ) రవాణా కుడా కేవలం 60, 70 శాతం మాత్రమే రవాణా చేస్తుండడంతో కొన్ని ఏరియాల్లో ఉత్పత్తి లక్ష్యాలు సాధించలేకపోతున్నాయి. యాజమాన్యం 18 ఓసీపీల్లో ఇలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా 2, 3 సంస్థలకు ఓబీ మట్టి తవ్వకాలు టెండర్లు ఇచ్చినప్పటికీ అశించిన ఫలితాలు ఇవ్వడం లేదని చెప్పవచ్చు. ఓసీపీ కాంట్రాక్టు యాజమాన్యాలు పోటీకి పోయి ధరకంటే తక్కువ కోడ్ చేసి టెండర్లు దక్కించుకొని ఓబీ లక్ష్యాలు చేరుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అరోపణలు ఉన్నాయి. వర్షాలతో ఓసీపీల కార్మికులు యంత్రాల మెయింటనెన్స్, ఉపరితలంలోని బంకర్ల రిపేరు చేస్తున్నారు.



శ్రీరాంపూర్ ఓసీపీలో భారీ వర్షాలతో నిర్మానుష్యంగా మారిన క్వారీ

**సింగరేణి వ్యాప్తంగా ఐదు రోజులూగా బొగ్గు ఉత్పిత్తి, మట్టి రవాణాలో అంతరాయం**

| తేదీ | లక్ష్యం | సాధించింది | శాతం | మట్టి క్యూ మీలక్ష్యం | సాధించింది | శాతం |
|---|---|---|---|---|---|---|
| 18 | 160792 | 114618 | 71% | 1242096 | 9944 | 1% |
| 19 | 160792 | 97028 | 60% | 1242096 | 9998 | 1% |
| 20 | 160792 | 88503 | 55% | 1242096 | 7953 | 1% |
| 21 | 152600 | 88503 | 0% | 1242096 | 0 | 0% |
| 22 | 152600 | – | 0% | 1242096 | 0 | 0% |

## ఆటంకం లేకుండా చూడండి

- డైరెక్టర్(ఆపరేషన్) ఎన్వీకే శ్రీనివాస్
- ఆర్జీ 2లో పర్యటన



గనిలోకి వెళ్తున్న డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్

యైటింక్లయిన్ కాలనీ, జూలై 22 : వర్షాల నేపథ్యంలో ఉత్పత్తికి ఆటంకం లేకుండా చూసుకోవాలని డైరెక్టర్ (ఆపరేషన్) ఎన్వీకే శ్రీనివాస్ సూచించారు. శనివారం ఆర్జీ-2 ఏరియాలో ఆయన పర్యటించారు. జీఎం ఐత మనోహర్‌తో కలిసి వకీలుపల్లి గని, ఓసీపీ-3 ప్రాజెక్టుల్లో పర్యటించి బొగ్గు ఉత్పత్తిపై అధికారులతో సమీక్షించారు. వకీలుపల్లి గనిలోకి దిగి 3సీమ్‌లో పని చేస్తున్న కంటిన్యూస్ మైనర్ పనితీరు, పని స్థలాలను పరిశీలించారు. ఓసీపీ ప్రాజెక్టుల్లో వర్షం కారణంగా ఉత్పత్తి తగ్గిన దృష్ట్యా భూగర్భ గనుల్లో ఉత్పత్తి పెంచడంపై దిశా నిర్దేశం చేశారు. ఓసీపీ-3 ప్రాజెక్టును వ్యూపాయింట్ ద్వా రా పరిశీలించారు. ప్రాజెక్టులో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బొగ్గు ఉత్పత్తి త్వరితగతిన చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాన్ని దృష్టిలో పెట్టుకుని బొగ్గు, ఓబీ ఉత్పత్తికి అంతరాయం కలుగకుండా, ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీకేపీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ రవికిరణ్, ఇంజినీర్ చం ద్రశేఖర్, సర్వే అధికారి అప్సర్‌పాషా, సంక్షేమాధికారి ఓంకారిబాబు, ఓసీపీ-3 అధికారి మధుసూదన్, ప్రాజెక్టు మేనేజర్ రమేశ్, సర్వే అధికారి నర్సింహారావు, డీజీఎం(సి) ధనుంజయ్, ఇన్‌చార్జి సెక్యూరిటీ అధికారి రాజారెడ్డి, తదితరులున్నారు.

## ముందస్తు ప్రణాళికలు చేసుకోవాలి

- వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనపై డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశం
- ఎస్సార్పీ 3 గనిలోకి దిగి పనిస్థలాల పరిశీలన



ఎస్సార్పీ 3 గనిలోకి దిగుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జూలై 22 : ఎస్సార్పీ 3గనిలో అధికారులు ముందస్తు ప్రణాళికలతో వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎస్ఆర్పీ 3గనిలోకి జీఎం సంజీవరెడ్డి, కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్యతో కలిసి గనిలోకి దిగారు. గనిలోని పనిస్థలాలు పరిశీలించారు. గనిలో కొత్తగా చేపట్టబోయే 3 ఎస్‌పీ 2 డిస్టిక్ 3వసీంను తనిఖీ చేశారు. రక్షణ చర్యలు పరిశీలించారు. అనంతరం గనిపై రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, గని ఏజెంట్ గోపాల్‌సింగ్, గని మేనేజర్ సంతోష్‌కుమార్‌తో గని ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ గని వార్షిక ఉత్పత్తి లక్ష్యం 2.8 లక్షల టన్నులు వచ్చే ఏడాది 4.4 లక్షల టన్నులకు పెంచాలని సూ చించారు. కార్మికులు వ్యక్తిగత రక్షణ సూ త్రా లు పాటించాలని కోరారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీ ధర్ రావు, గని సేఫ్టీ ఆఫీసర్ మహేందర్ పాల్గొన్నారు.

## అవగాహనతోనే ప్రమాదాల నివారణ

- కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య
- కాసిపేట గనిలో రక్షణపై సమావేశం

కాసిపేట, జూలై 2 : అవగాహనతోనే ప్రమాదాలను నివారించవచ్చని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య పేర్కొన్నారు. కాసిపేట గనిపై రక్షణ అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలను ముందస్తు గుర్తించడం, ప్రమాదాలను నివారించడంపై అవగాహన కల్పించారు. ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మందమర్రి జీఎం మోహన్ రెడ్డి మాట్లాడుతూ సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ విధానాలను తెలుసుకోవాలని సూచించారు. సేఫ్టీపై యాజమాన్యం శిక్షణ తరగుతులు ఏర్పాటు చేస్తున్నదని రీజినల్ సేఫ్టీ జీఎం గుప్తా పేర్కొన్నారు. అనంతరం కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్యను యూనియన్ నాయకులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఏజెంట్ రాందాస్, మేనేజర్ అల్లావుద్దీన్, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఏరియా రక్షణాధికారి రవీందర్, ఏరియా ఇంజనీర్ నాగరాజు, టీబీజీకేఎస్ నాయకులు బడికెల సంపత్, ఓ రాజశేఖర్, శంకర్‌రావు, బన్న లక్ష్మణ్ దాస్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ వొడ్నాల రాజన్న, బండారు రమేశ్, తదితర నాయకులు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



కార్పొరేట్ సేఫ్టీ జీఎంను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

### రక్తదాన శిబిరం

రామగిరి, జూలై 22: తలసేమియాతో బాధపడుతున్న వారి కోసం చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసింది. సెంటినరీకాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో శనివారం సంస్థ వ్యవస్థాపకులు బొడ్డు మహేందర్ రావు వర్ధంతి సందర్భంగా సంస్థ అధ్యక్షులు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఓసీపీ-1 పీవో ఎన్.రాధాకృష్ణ, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి హాజరై ప్రారంభించారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల ప్రాణాలు నిలబెట్టే ఉద్దేశంతో రక్తదాన శిబిరం నిర్వహించిన సంస్థ సభ్యులను అభినందించారు. అనంతరం ఓసీపీ--1 పీవో రాధాకృష్ణను శాలువాతో శిబిరం నిర్వాహకులు సన్మానించారు. డీవైపీఎం ముప్పిడి రవీందర్, ఎస్‌వో ఇనుగాల లక్ష్మీనారాయణ, పీవో ఏ సురేశ్, జడ్పీటీసీ మ్యాదరబోయిన శారదాకుమార్, సర్పంచ్‌లు పల్లె ప్రతిమ, గంట పద్మ, అల్లం పద్మ, గ్రంథాలయ డైరెక్టర్ ఇజ్జగిరి రాజు, నాయకులు శ్రీ కాంత్ రావు, బత్తుల రమేశ్, పాశం శ్రీనివాస్, దుబ్బాక సత్యారెడ్డి, శ్రీనివాస్, క్రాంతి, కాటం సత్యం, తన్నీరు ప్రదీప్, ఆసం తిరుపతి, డా.శరణ్య, సంతోష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### ఘన సన్మానం

శ్రీరాంపూర్, జులై 22: శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ పీవోఏ కాసర్ల బాపయ్య సంస్థలో 40 ఏండ్ల సర్వీసు పూర్తి చేసుకున్నందున అధికారులు, టీబీజీకేఎస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. శనివారం జీఎం ఆఫీస్ పర్సనల్ డిపార్ట్‌మెంటులో జరిగిన ఆత్మీయ సన్మాన సభలో డీవైజీఎం(పర్సనల్) అరవిందరావు, రాజేశ్వర్‌రావు, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి పీవోఏ కాసర్ల బాపయ్యను శాలువాలతో సత్కరించారు. పర్సనల్ మేనేజర్లు, రాజేశ్వరావు, కాంతారావు, డీవైపీఎం దేవేందర్, సీనియర్ పీవో ప్రకాశ్, సుదర్శన్, ఆఫీస్ క్లరికల్ సిబ్బంది శ్రీధర్, రాజేశ్, విటేకర్, రాజన్న, సురేశ్, కల్యాణి, నవ్య పాల్గొన్నారు.

### మేనేజ్‌మెంట్ సిస్టంపై శిక్షణ

గోదావరిఖని, జూలై 22: ఆర్జీ-1లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి మేనేజ్‌మెంట్ సిస్టంపై శనివారం ఆర్జీ-1 జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల మస్టర్లు శాప్ నమోదు, వ్యక్తిగత వివరాలు శాప్ ద్వారా ఆన్‌లైన్ నమోదు, ఆరోగ్య వివరాలు, మెడికల్ హిస్టరీ తదితర వివరాలను ఏ విధంగా శాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలో డీజీఎం కార్పొరేట్ హరి శంకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడి పూర్తి వివరాలను అత్యంత సులభంగా తెలుసుకోవచ్చని, కచ్చితమైన వివరాలు ఎక్కడ నుంచైనా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జీఎం సేఫ్టీ సాంబయ్య, సేఫ్టీ అధికారి బండి సత్యనారాయణ, డీజీఎం మదన్మోహన్, రాజేశ్, హనుమంతరావు, గణేశ్, ఫిరోజ్ ఖాన్, రవీందర్ తదితరులున్నారు.

### మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కు అందజేత

జయశంకర్ భూపాలపల్లి, జూలై 22 (నమస్తే తెలంగాణ): 2022-23 విద్యా సంవత్సరంలో నిర్వహించిన నీట్‌లో ఆలిండియా 19,336 ర్యాంక్ సాధించి ఏఐఎంఎస్ నాగ్‌పూర్‌లో ఎంబీబీఎస్ సీటు పొందిన పర్స అనిల్ శ్రీవాస్తవ తండ్రి పర్స శ్రీనివాస్ (స్పోర్ట్స్ సూపర్‌వైజర్, జీఎం ఆఫీస్)కు శనివారం జీఎం కార్యాలయంలో రూ.10వేల మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కును జీఎం శ్రీనివాసరావు, ఫైనాన్స్ మేనేజర్ సురేఖ అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉత్తమ ర్యాంకు సాధించిన అనిల్ శ్రీవాస్తవను అభినందించారు. ఎస్‌వోటూ జీఎం బీవెంకటయ్య, ఏజీఎం ఐఈడీ జ్యోతి, పీవో వెంకట్రాం రెడ్డి, పర్సనల్, సివిల్ డీజీఎంలు అజ్మీరా తుకారం, రవి కుమార్, ఫైనాన్స్ మేనేజర్ సురేఖ, పీఎం శివకేశవరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌కు చెక్కు అందిస్తున్న జీఎం శ్రీనివాసరావు, ఫైనాన్స్ మేనేజర్ సురేఖ